www.bhadradrinews.com

# భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily | శుక్రవారం 11, సెప్టెంబర్, 2026

## రీ-సర్వే పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్


2 లో..

**భూ రీ-సర్వేతో సమస్యలకు శాశ్వత పరిష్కారం**

**సీతయ్య గూడెంలో పర్యటించిన జిల్లా కలెక్టర్ అంకిత్**

చంద్రుగొండ/జూలూరుపాడు(భద్రాద్రి న్యూస్)ప్రతినిధి: భూ రీ-సర్వే ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. గురువారం చంద్రుగొండ మండలంలోని సీతాయిగూడెం గ్రామంలో కొనసాగుతున్న భూ రీ-సర్వే పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వే పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకుని, ఖచ్చితత్వంతో వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామ పరిధిలో మొత్తం 1,823 ఎకరాలకు రీ-సర్వే నిర్వహించాల్సి ఉండగా, ప్రస్తుతం గ్రామ సరిహద్దులు, భూముల వివరాల పరిశీలన కొనసాగుతున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు.

## సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించాలి

### కేసుల దర్యాప్తు, సైబర్ నేరాల నియంత్రణలో టెక్నాలజీ కీలకం : ఎస్పీ రోహిత్ రాజు


2లో

భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 10 (భద్రాద్రి న్యూస్):- పోలీసింగ్‌లో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించి మెరుగైన ఫలితాలు సాధించాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సూచించారు. జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో గురువారం టెక్ టీమ్ ఆపరేటర్లు, సైబర్ వారియర్స్‌కు వివిధ పోలీసింగ్ వెబ్ అప్లికేషన్లపై నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణ తరగతులను ఎస్పీ ప్రారంభించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం ద్వారా కేసుల దర్యాప్తు, నేరస్థుల గుర్తింపు, సైబర్ నేరాల నియంత్రణ, డిజిటల్ సాక్ష్యాల సేకరణ మరింత సమర్థవంతంగా చేపట్టవచ్చన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. సంబంధిత సమాచారాన్ని ఎప్పటికప్పుడు సక్రమంగా నమోదు చేయడంతో పాటు సాంకేతిక సాధనాలను పోలీసింగ్‌లో విస్తృతంగా వినియోగించాలని ఆదేశించారు. శిక్షణలో సీసీటీఎన్ఎస్ 2.0, క్రై-మాక్, ఐసీజేఎస్, టీఎస్-కాప్స్, డయల్-100, ఎఫ్ఆర్ఎస్,

## సెప్టెంబర్ 19న కోదాడలో మెగా జాబ్ మేళా


2లో

**మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డిఏర్పాట్లపై ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులతో మంత్రి సమీక్ష**

**కోదాడ, సెప్టెంబర్ 10 (భద్రాద్రి న్యూస్):**

నేటి సమాజంలో నిరుద్యోగం అత్యంత తీవ్రమైన సమస్యగా మారిందని, విద్యావంతులైన యువతకు తగిన ఉపాధి అవకాశాలు కల్పించడం ప్రభుత్వం, పరిశ్రమలు, ప్రైవేట్ సంస్థలు మరియు నైపుణ్యాభివృద్ధి సంస్థల సమష్టి బాధ్యత అని రాష్ట్ర నీటిపారుదల, ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. నిరుద్యోగ యువతకు మెరుగైన భవిష్యత్తును అందించడమే ధ్యేయంగా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఆయన స్పష్టం చేశారు. ఈ నెల సెప్టెంబర్ 19వ తేదీ (శనివారం) ఉదయం 8:00 గంటల నుండి రాత్రి 8:00 గంటల వరకు కోదాడ పట్టణంలోని సి.సి. రెడ్డి కాన్వెంట్ స్కూల్ ప్రాంగణంలో భారీ మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు మంత్రి పునరుద్ఘాటించారు. మెగా జాబ్ మేళా ఏర్పాట్లు, నిరుద్యోగులకు కల్పించాల్సిన సదుపాయాలపై గురువారం కోదాడలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, స్థానిక ఎమ్మెల్సీలు, మున్సిపల్ చైర్మన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నంబాబు, కాంగ్రెస్ ప్రముఖ నాయకులు బషీర్, అప్పిరెడ్డి, జిల్లా ఉన్నతాధికారులు మరియు ప్రముఖ కంపెనీల హెచ్ఆర్ ప్రతినిధులు పాల్గొన్నారు. వివిధ రంగాల ప్రముఖ కంపెనీల ఈ జాబ్ మేళాలో దేశవ్యాప్తంగా ఉన్న పలు ప్రముఖ ఐటీ, ఫార్మా, బ్యాంకింగ్, ఆటోమొబైల్, మరియు సేవా రంగాలకు చెందిన మల్టీనేషనల్ కంపెనీలు (ఎమ్ ఎన్ సిస్ )పాల్గొని అభ్యర్థులను నేరుగా ఇంటర్వ్యూల ద్వారా ఎంపిక చేయనున్నాయి.

### గణేష్ నవరాత్రుల ఉత్సవాలు

## ప్రశాంతంగా, భద్రతతో నిర్వహించాలి


2వ పేజీలో...

**మండపాల నిర్వాహకులతో సమన్వయ సమావేశంలో పోలీస్ కమిషనర్**

**ఖమ్మం ప్రతినిధి ,సెప్టెంబర్ 10 (భద్రాద్రి న్యూస్):** గణేష్ నవరాత్రుల ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, సోదరభావంతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తూ.. సహకరించాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సూచించారు. రానున్న గణేష్ నవరాత్రుల ఉత్సవాలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా గణేష్ మండపాల నిర్వాహకులతో నగరంలోని సూర్య తేజ ఫంక్షన్ హాల్ లో పోలీసు అధికారులు సమన్వయ సమావేశం నిర్వహించి, ఉత్సవాల నిర్వహణలో పాటించాల్సిన భద్రతా నిబంధనలు, పోలీసు శాఖ సూచనలు, ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీసు కమిషనర్ మాట్లాడుతూ.. ఖమ్మం మున్నేరు నదిలో ప్రస్తుతం నీటి లభ్యత తక్కువగా ఉన్న నేపథ్యంలో వినాయక విగ్రహాల నిమజ్జనానికి ప్రత్యామ్నాయంగా అనువైన ఖమ్మం అర్బన్ మండలంలోని దంసలాపురం గ్రామపంచాయతీ లోని కొత్తూరు చెరువులో కొనసాగుతున్న నేపథ్యంలో మట్టి విగ్రహాల ప్రతిష్ఠాపనకు సహకరించాలి అన్నారు. అదేవిదంగా గణేష్ మండపాల నిర్వాహకులు పోలీసు శాఖ పోర్టల్ policeportal.tspolice.gov.in లో రిజిస్టర్ అయి మండపాల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవడం ద్వారా మండపాల ఏర్పాటు, విగ్రహాల ప్రతిష్ఠాపన, పూజా కార్యక్రమాలు, ఊరేగింపులు, నిమజ్జనం తదితర కార్యక్రమాలను ముందస్తు ప్రణాళికతో నిర్వహించే అవకాశం ఉంటుందని అన్నారు. మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, విద్యుత్..

# రీ-సర్వే పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్





**మొదటి పేజీ తరువాయి**

భూమి ఉన్నప్పటికీ పట్టాదారు పాస్‌బుక్‌లు లేని వారు, రికార్డుల్లో వివరాలు నమోదు కాని భూములు, క్షేత్రస్థాయి వివరాలకు రికార్డులకు మధ్య వ్యత్యాసాలు ఉన్నట్లు తెలిపారు.

**పాత రికార్డులను పరిశీలించిన కలెక్టర్**

సుమారు 1920ల నాటి పాత భూ మ్యాప్‌లు, రికార్డులను కలెక్టర్ పరిశీలించారు. భూముల హద్దులను స్పష్టంగా గుర్తించి, భవిష్యత్‌లో కూడా సులభంగా గుర్తించే విధంగా శాశ్వత హద్దు గుర్తులు ఏర్పాటు చేయాలని సూచించారు.

**గిరిజనులతో మాట్లాడిన కలెక్టర్**

ఈ సందర్భంగా గ్రామంలోని గిరిజనులతో కలెక్టర్ నేరుగా మాట్లాడి రీ-సర్వే వల్ల కలిగే ప్రయోజనాలను తెలుసుకున్నారు. పాత రికార్డులను పరిశీలించి క్షేత్రస్థాయిలో ఉన్న భూములను గుర్తించడం ద్వారా భూ హక్కులకు స్పష్టత వస్తుందని గిరిజనులు తెలిపారు. భూముల వాస్తవ విస్తీర్ణం, హద్దులు, సర్వే నంబర్లు, పట్టాదారు వివరాలను పాత రికార్డులతో సరిపోల్చి ఖచ్చితంగా నమోదు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఏ ఒక్క అర్హుడి భూమి వివరాలు రికార్డుల్లో తప్పిపోకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి రీ-సర్వేను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. ఈ పరిశీలనలో తహసీల్దార్ జగదీశ్వర ప్రసాద్, ఎంపీడీవో అశోక్, సర్వే, అటవీ శాఖల అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించాలి



**మొదటి పేజీ తరువాయి**

ఎంటర్‌ప్రైజ్ చెక్, ఈ-సాక్ష్య, సైక్యాప్స్, దోపామ్స్, ఎన్‌సీఆర్‌పీ, ఐరాడ్, సమన్వయ పోర్టల్, సీఈఐఆర్, దర్పణ్, సహయోగ్, వాత్సల్య, జీఆర్‌ఎం, ఎంఆర్‌ఎఫ్, నాట్‌గ్రిడ్, గాండీవ తదితర వెబ్ అప్లికేషన్ల వినియోగంపై సిబ్బందికి శిక్షణ అందించారు. కార్యక్రమంలో ఐటీ కోర్ సీఐ రాము, సైబర్ సెల్ సీఐ జితేందర్, సీఐలు రమాకాంత్, లక్ష్మి, పోలీసు అధికారులు, టెక్ టీమ్ ఆపరేటర్లు, సైబర్ వారియర్స్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# గణేష్ నవరాత్రుల ఉత్సవాలు ప్రశాంతంగా, భద్రతతో నిర్వహించాలి

**మొదటి పేజీ తరువాయి**

కనెక్షన్లు మరియు వైరింగ్‌ను నిపుణులతో తనిఖీ చేయించాలని సూచించారు. అగ్నిప్రమాదాలు సంభవించకుండా.. అవసరమైన అగ్నిమాపక పరికరాలను అందుబాటులో ఉంచాలని, మండపాల వద్ద అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లేందుకు మార్గాలను ఎట్టి పరిస్థితుల్లోనూ మూసివేయకూడదని స్పష్టం చేశారు.

మండపాల వద్ద భక్తులు, మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉన్నందున రద్దీ నియంత్రణ, పార్కింగ్, ట్రాఫిక్ నిర్వహణకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. డీజేలు, సౌండ్ సిస్టమ్‌ల వినియోగంలో ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, అధిక శబ్దంతో ప్రజలకు ఇబ్బంది కలిగించవద్దని నిర్వాహకులకు సూచించారు. రాత్రి వేళల్లో శబ్ద కాలుష్యానికి కారణమయ్యే కార్యక్రమాలు నిర్వహించకుండా నిబంధనలను పాటించాలని తెలిపారు. గణేష్ విగ్రహాల ఊరేగింపు, నిమజ్జనం సందర్భంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. నిర్ణయించిన మార్గాలు, సమయాలను పాటించాలని, ఊరేగింపులో పాల్గొనే వారు క్రమశిక్షణ పాటించేలా నిర్వాహకులు బాధ్యత తీసుకోవాలని తెలిపారు. నిమజ్జన ప్రదేశాల్లో విద్యుత్ ప్రమాదాలు, నీట మునిగే ప్రమాదాలు తదితర ఘటనలు జరగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చిన్నారులు, ఈత రాని వారు నీటిలోకి వెళ్లకుండా నిర్వాహకులు ప్రత్యేకంగా పర్యవేక్షించాలని తెలిపారు. గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించడంలో మండపాల నిర్వాహకుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఏదైనా అనుమానాస్పద పరిస్థితి, సమస్య లేదా అత్యవసర పరిస్థితి తలెత్తిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రజల భద్రత, శాంతిభద్రతలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ గణేష్ నవరాత్రుల ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, సోదరభావంతో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ పోలీస్ శాఖకు సహకరించాలని పోలీసు అధికారులు కోరారు.

**గణేష్ మండపాల నిర్వాహకులకు సూచనలు**

1) గణేష్ విగ్రహాల ఏర్పాటుకు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. నిర్వాహకుల పేర్లు మరియు సంప్రదింపు నంబర్లు పొందుపర్చాలి.

2) విగ్రహం ఏర్పాటు స్థలం ప్రైవేట్ వ్యక్తికి చెందినదైతే, సంబంధిత వ్యక్తుల నుండి ఎటువంటి అభ్యంతర లేదని ధృవీకరణ పత్రం పొందాలి.

3) నిర్వాహకులు "విగ్రహాలను రహదారిలో కాని వివాదాస్పద స్థలాల్లో ప్రతిష్టించవద్దని విజ్ఞప్తి.

4) ప్రధాన రహదారులపై మరియు ట్రాఫిక్ రద్దీగా వుండే రహదారులపై విగ్రహాలను ఏర్పాటు చేయరాదు.

5) విద్యుత్ షార్ట్ సర్క్యూట్ నివారించేందుకు.నాణ్యమైన విద్యుత్ తీగలు మరియు పరికరాలు గణేష్ పండల వద్దఉపయోగించాలి.

6) మండపాల వద్ద ణజీ లకు అనుమతి ఇవ్వబడదు,రెండు మైక్ తో కూడిన స్పీకర్లు(ధ్వని పరిమాణం తప్పనిసరిగా నాన్ డిస్ట్రబెన్స్ లెవెల్‌లో ఉండాలి) మాత్రమే అనుమతించబడతాయి. అదేవిధంగా ఉదయం 6.00 నుండి రాత్రి 10.00 వరకు సమయాలను అనుసరించి మైక్ సౌండ్ సిస్టమ్ వినియోగించాలి.

7) గణేష్ మండపాల వద్ద అసభ్యకరమైన నృత్యాలు, కార్యక్రమాలు చేపట్టకూడదు.

8) ప్రతి గణేష్ మండపంలో ఇద్దరు సభ్యులు 24 గంటలు ఉండేలా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేసుకోవాలి.

9) ప్రతి గణేష్ మండపం వద్ద నోటీసు బోర్డును, పాయింట్ బుక్ ఏర్పాటు చేసి తప్పనిసరిగా నిర్వాహకుల సంప్రదింపు నంబర్లు మరియు వివరాలను పొందుపర్చాలి.

10) అగ్ని ప్రమాదాలను నివారించడానికి ప్రతి మండపం దగ్గర తప్పనిసరిగా ఫైర్ ప్రూఫ్‌గా ఉండేలా చూసుకోండి. తగినంత నీరు ఇసుక అందుబాటులో వుండాలి.

కార్యక్రమంలో ఏసీపీ రమణమూర్తి, ఎస్బి ఏసీపీ మహేష్, ఇన్స్పెక్టర్లు కరుణాకర్, బాలకృష్ణ, మోహన్ బాబు, భానుప్రకాష్, ఉస్మాన్ షరీఫ్, సత్యనారాయణ విద్యుత్ శాఖ డిఇ రామారావు, ఫైర్ అధికారి రామిరెడ్డి, గణేష్ ఉత్సవ కమిటీ వినోద్ లౌహిటి, విద్యాసాగర్ పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా సవరణపై విచారణకు వేళాయె.. ఓటర్లు అప్రమత్తం

**భాగ్యనగర్ తండాలో 35, 36 పోలింగ్ కేంద్రాల విచారణ పూర్తి**

**రేపు 38, 39 కేంద్రాలపై విచారణ.. సంబంధిత ఓటర్లు తప్పక హాజరు కావాలి**



**కారేపల్లి, సెప్టెంబర్ 10 (భద్రాద్రి న్యూస్ -- రాములు):** ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా సింగరేణి మండలం భాగ్యనగర్ తండా గ్రామపంచాయతీ పరిధిలోని 35, 36 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన అభ్యంతరాలపై గురువారం విచారణ నిర్వహించారు. ఎంఆర్‌ఓ ఓరుగంటి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో విచారణ ప్రక్రియను పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ తండా సర్పంచ్ బానోత్ హీరాలాల్, పంచాయతీ కార్యదర్శి పెండ్ర అనిల్ కుమార్ పాల్గొని విచారణ ప్రక్రియను పర్యవేక్షించారు. ఓటర్ల జాబితాలోని వివరాలను పరిశీలించి, వచ్చిన అభ్యంతరాలపై సంబంధిత ఓటర్ల నుంచి వివరాలు తెలుసుకున్నట్లు అధికారులు తెలిపారు.

**రేపు 38, 39 కేంద్రాలపై విచారణ**

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణలో భాగంగా శుక్రవారం 38, 39 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన అభ్యంతరాలపై విచారణ నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. విచారణకు సంబంధించిన సమాచారం అందిన ఓటర్లు నిర్ణీత సమయానికి తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు. తమ ఓటరు వివరాల్లో ఏవైనా తప్పులు, మార్పులు లేదా అభ్యంతరాలు ఉంటే విచారణ సమయంలో అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అవసరమైన ఆధారాలు ఉంటే వాటిని కూడా సమర్పించాలని సూచించారు.

**ఓటు హక్కుపై నిర్లక్ష్యం వద్దు**

విచారణకు హాజరు కావాల్సిన ఓటర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయకుండా నిర్ణీత సమయంలో హాజరై తమ వివరాలను పరిశీలించుకోవాలని అధికారులు కోరారు. ఓటు హక్కుకు సంబంధించిన ముఖ్యమైన ప్రక్రియ కావడంతో సంబంధిత ఓటర్లు ముందుగానే అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# సెప్టెంబర్ 19న కోదాడలో మెగా జాబ్ మేళా

**మొదటి పేజీ తరువాయి**

టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఐటీఐ మరియు డిప్లొమా, బీటెక్ పూర్తి చేసిన అర్హులైన అభ్యర్థులందరూ ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నాయకులు పిలుపునిచ్చారు.సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. జాబ్ మేళాకు వచ్చే నిరుద్యోగ యువతీ యువకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, నీడ, కౌంటర్లు మరియు రవాణా ఏర్పాట్లు పక్కాగా పూర్తి చేయాలని అధికారులను, కాంగ్రెస్ శ్రేణులను ఆదేశించారు. కోదాడ నియోజకవర్గ చరిత్రలోనే ఇదొక అతిపెద్ద ఉపాధి వేదికగా నిలవబోతోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



ధీమా వ్యక్తం చేశారు.

## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి చిరస్మరణీయం

**రజాకార్లకు వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడిన వీరనారి ఐలమ్మ**

**ఖమ్మం ప్రతినిధి ,సెప్టెంబర్ 10( భద్రాద్రి న్యూస్):-**



స్వర్గీయ వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా 36వ డివిజన్ రజకవీధిలోని ఐలమ్మ విగ్రహానికి డివిజన్ కార్పొరేటర్ పసుమర్తి రామ్మోహన్‌రావు పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు.
ఈ సందర్భంగా కార్పొరేటర్ రామ్మోహన్ రావు మాట్లాడుతూ.. నాటి రజాకార్ల దురాగతాలకు వ్యతిరేకంగా చాకలి ఐలమ్మ తిరుగుబాటు చేసి, కమ్యూనిస్టు నాయకులతో కలిసి వీరోచితంగా పోరాడారని కొనియాడారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. ఐలమ్మ ఆశయాలు, పోరాట స్ఫూర్తిని నేటి తరానికి తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు.
కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ డివిజన్ కార్యదర్శి పిల్లుట్ల కృష్ణ, సీపీఎం అనుబంధ సంఘాల నాయకులు జిల్లా ఉపేందర్, తాళ్లూరి వెంకన్న, మాదారపు కోటి, మామిడాల తిరుమలరావు, గంధపు కోటేశ్వరరావు, సాయిరాం, సత్తు భారతి, అల్వాల ఉష తదితరులు పాల్గొని ఐలమ్మకు నివాళులర్పించారు.

## ఖమ్మం ప్రెస్ క్లబ్ కోశాధికారిగా పిన్ని సత్యనారాయణ

**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 10( భద్రాద్రి న్యూస్):-**



ఖమ్మం ప్రెస్ క్లబ్ కోశాధికారిగా సీనియర్ జర్నలిస్ట్ పిన్ని సత్యనారాయణ(మన తెలంగాణ) ఎన్నికైనట్లు టియూడబ్ల్యూజె (ఐజెయూ ) ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నామా పురుషోత్తం, ప్రధాన కార్యదర్శి శీలం శ్రీనివాస్ తెలిపారు. గురువారం జరిగిన కమిటీ ప్రత్యేక సమావేశంలో ఈ ఎన్నిక జరిగినట్లు తెలిపారు. ప్రెస్ క్లబ్ లో జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేసేందుకు కమిటీ పని చేస్తున్నట్లు తెలిపారు. సీనియర్ జర్నలిస్ట్ గా సత్యనారాయణ అందరికీ సుపరిచితులని తెలిపారు. ఈ సందర్భంగా సత్యనారాయణకు అభినందనలు తెలిపారు.

## పేదల వైద్యానికి సీఎంఆర్ఎఫ్ భరోసా!

**మధిరలో రూ. 66,500 విలువైన చెక్కుల పంపిణీ**



**మధిర ఆర్సీ (భద్రాద్రి న్యూస్):- సెప్టెంబర్ 10:**
అనారోగ్యంతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న పేద కుటుంబాలకు సీఎం సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) అండగా నిలిచింది. మధిరలోని రాజ్యసభ సభ్యురాలు శ్రీమతి రేణుకా చౌదరి క్యాంపు కార్యాలయంలో గురువారం సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి ముఖ్య అనుచరుడు జవ్వాజి ఆనందరావు ఆధ్వర్యంలో ముగ్గురు లబ్ధిదారులకు మొత్తం రూ. 66,500 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఎంపీ రేణుకా చౌదరి సహకారంతో, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సిఫారసుతో ఈ చెక్కులు మంజూరైనట్లు తెలిపారు.

**లబ్ధిదారులకు అందిన చెక్కుల వివరాలు:**

ఎదురు పద్మావతి (సిరిపురం) -- రూ. 23,000
మడి వెంకన్న (ఇల్లూరు) -- రూ. 27,500
కొండల అర్చన (ఇల్లూరు) -- రూ. 16,000

ఈ సందర్భంగా లబ్ధిదారులు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి కార్లపూడి అప్పారావు, మధిర మండల నాయకులు అవ్వల గురుబ్రహ్మం, జల్లేపల్లి ప్రసాద్, బాదా సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మహిళా హెచ్‌ఎంపై తోటి ఉపాధ్యాయుడి దాడి యత్నం

**రామానుజవరం జడ్పీహెచ్ఎస్‌లో కలకలం..**
**పరస్పర ఫిర్యాదులపై అధికారుల నిర్లక్ష్యమే కారణమా?**
**మణుగూరు సెప్టెంబర్ 10( భద్రాద్రి న్యూస్):-**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మండలంలోని రామానుజవరం జడ్పీహైస్కూల్‌లో మహిళా హెచ్‌ఎంపై తోటి ఉపాధ్యాయుడు దాడికి యత్నించిన ఘటన గురువారం కలకలం రేపింది. గత కొంతకాలంగా హెచ్‌ఎం, సదరు ఉపాధ్యాయుడి మధ్య పరస్పర ఫిర్యాదులు ఉన్నప్పటికీ విద్యాశాఖ అధికారులు సకాలంలో స్పందించకపోవడంతోనే పరిస్థితి ఉద్రిక్తంగా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.
హెచ్‌ఎం యశోద తెలిపిన వివరాల ప్రకారం.. మణుగూరు జడ్పీహెచ్ఎస్‌లో మండలస్థాయి క్రీడా పోటీలు జరుగుతున్న నేపథ్యంలో రామానుజవరం పాఠశాల నుంచి 13 మంది విద్యార్థినులు గురువారం పోటీలకు హాజరయ్యారు. వారి వెంట ఇద్దరు ఉపాధ్యాయులను పంపించారు.
ఈ క్రమంలో సోషల్ ఉపాధ్యాయుడు తనను కూడా విద్యార్థినులతో పంపించాలని హెచ్‌ఎంను కోరినట్లు, అయితే 13 మంది విద్యార్థినులకు ఇప్పటికే ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారని, మరో ఉపాధ్యాయుడి అవసరం లేదని హెచ్‌ఎం తెలిపినట్లు సమాచారం. దీంతో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగినట్లు పేర్కొన్నారు.
తన మాట వినాలని, తాను చెప్పినట్లుగానే పాఠశాల నడవాలంటూ సదరు ఉపాధ్యాయుడు ఆగ్రహం వ్యక్తం చేసి తనపై దాడికి యత్నించినట్లు హెచ్‌ఎం ఆరోపించారు. దివ్యాంగురాలైన తాను తీవ్ర భయాందోళనకు గురైనట్లు తెలిపారు.
ఘటనపై వెంటనే జిల్లా విద్యాశాఖాధికారికి సమాచారం అందించడంతో పాటు 100కు డయల్ చేసినట్లు హెచ్‌ఎం తెలిపారు. స్పందించిన డీఈఓ విచారణకు ఆదేశించి, అశ్వాపురం ఎంఈఓ వీరస్వామిని సంఘటనా స్థలానికి పంపినట్లు తెలిసింది. ఎంఈఓ పాఠశాలకు చేరుకుని ఇరువర్గాల నుంచి వివరాలు సేకరించి విచారణ చేపట్టారు.
మరోవైపు పోలీసులు కూడా ఘటనకు సంబంధించిన వివరాలను సేకరించి, ఇరువర్గాలు పోలీసుస్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని సూచించారు. దీంతో గురువారం సాయంత్రం ఇరువర్గాలు పోలీసులకు వేర్వేరుగా ఫిర్యాదులు చేసినట్లు సమాచారం.
పాఠశాలలో ఉపాధ్యాయుల మధ్య నెలకొన్న వివాదానికి ఉన్నతాధికారులు శాశ్వత పరిష్కారం చూపాలని, విద్యార్థుల విద్యాభ్యాసానికి ఎలాంటి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## త్రివేణి కిడ్స్‌లో ఘనంగా గ్రాండ్ పేరెంట్స్ డే





**తరతరాల అనుబంధానికి వేదికగా ఆత్మీయ వేడుకలు**
**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబరు 10 (భద్రాద్రి న్యూస్):**

తాతయ్యలు, నానమ్మలు, అమ్మమ్మలతో పిల్లల అనుబంధాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు, వారి ప్రేమ, ఆప్యాయత, అనుభవాలను పిల్లలకు చేరువ చేయాలనే ఉద్దేశంతో త్రివేణి కిడ్స్ క్యాంపస్‌లో గ్రాండ్ పేరెంట్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ తాతయ్యలు, అమ్మమ్మలతో కలిసి కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. చిన్నారులు తమ గ్రాండ్ పేరెంట్స్‌కు పాదపూజ చేసి ఆశీర్వాదాలు పొందడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రేమాభిమానాలతో వారిని సత్కరించి, బహుమతులు అందజేశారు. పిల్లలతో కలిసి సమయం గడిపిన గ్రాండ్ పేరెంట్స్ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తీసుకున్న ఫొటోలు ఆత్మీయ జ్ఞాపకాలుగా నిలిచాయి. ఈ సందర్భంగా డైరెక్టర్ డా. గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ.. “పిల్లల వ్యక్తిత్వ వికాసంలో గ్రాండ్ పేరెంట్స్ పాత్ర ఎంతో విలువైనది. వారి అనుభవాలు, జీవిత విలువలు, ప్రేమ పిల్లలకు మంచి మార్గదర్శకంగా నిలుస్తాయి. తరతరాల మధ్య అనుబంధాన్ని పెంపొందించే ఇలాంటి కార్యక్రమాలు పిల్లల్లో కుటుంబ విలువలను మరింత బలపరుస్తాయి” అని అన్నారు. ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ.. “తాతయ్యలు, అమ్మమ్మలు పిల్లలకు ప్రేమను మాత్రమే కాదు.. జీవితాన్ని అర్థం చేసుకునే జ్ఞానాన్ని, సంస్కారాన్ని అందిస్తారు. వారితో పిల్లలు గడిపే ప్రతి క్షణం ఒక మధురమైన జ్ఞాపకంగా మిగులుతుంది. గ్రాండ్ పేరెంట్స్ డే ద్వారా పిల్లలు తమ పెద్దల పట్ల కృతజ్ఞత, గౌరవ భావాలను వ్యక్తం చేయడం ఎంతో ఆనందంగా ఉంది” అని తెలిపారు. కార్యక్రమం ఆహ్లాదకరమైన వాతావరణంలో సాగగా, విద్యార్థులు-ఉపాధ్యాయులు,పాటలు, కవితలతో అలరించగా, గ్రాండ్ పేరెంట్స్ ఉత్సాహంగా పాల్గొన్నారు. “తరాలు కలిస్తే... భవిష్యత్తు మరింత వెలుగొందుతుంది” అనే సందేశంతో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సి. ఆర్. ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్స్ స్వప్న, ముస్తఫా, క్యాంపస్ ఇంచార్జ్ విక్టర్ చార్లెస్, ట్రాన్స్‌పోర్ట్ ఇంచార్జ్ సందీప్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బీసీ మహిళలకు వంద శాతం సబ్సిడీపై ఆటోమేటిక్ కుట్టు మిషన్లు

**దరఖాస్తుల ఆహ్వానం...బిసి అభివృద్ధి అధికారిణి జ్యోతిలి**
**అర్హులైన బీసీ మహిళలు సెప్టెంబర్ 15వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలి**
**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 10 (భద్రాద్రి న్యూస్):-**

బీసీ మహిళలకు ఉపాధి కల్పించే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్ల పంపిణీ పథకం ప్రారంభించి, వందశాతం సబ్సిడీపై ఆటోమేటిక్ కుట్టు మిషన్ల పంపిణీ పథకాన్ని అమలు చేస్తోందని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిణి జి. జ్యోతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకానికి దరఖాస్తు చేసుకునే మహిళలు ఖమ్మం జిల్లాకు చెందిన బీసీ వర్గానికి చెందిన మహిళలై ఉండాలని, 18 నుంచి 55 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలని పేర్కొన్నారు. నిరుద్యోగ మహిళలు, నిరాశ్రయులు, వితంతువులు, ఒంటరి మహిళలు, అనాథ మహిళలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ వార్షిక ఆదాయం రూ. 1.50 లక్షలకు, పట్టణ ప్రాంతాల్లో రూ. 2.00 లక్షలకు మించకూడదని, తెల్ల రేషన్ కార్డు/ఫుడ్ సెక్యూరిటీ కార్డు లేదా ఆదాయ ధృవీకరణ పత్రాన్ని సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. కుట్టు వృత్తిలో నైపుణ్యం కలిగిన వారికి, అలాగే కనీస



ప్రాథమిక అక్షరాస్యత ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. అర్హులైన బీసీ మహిళలు సెప్టెంబర్ 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ దరఖాస్తులను *tgobmms.cgg.gov.in పోర్టల్ ద్వారా సమర్పించాలని తెలిపారు. అర్హత కలిగిన బీసీ మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నిర్దేశిత గడువులోగా సంబంధిత ధృవీకరణ పత్రాలతో గ్రామీణ ప్రాంతవాసులు మండల పరిషత్ అభివృద్ధి అధికారికి, పట్టణ వాసులు మునిసిపల్ కమీషనర్ లకు దరఖాస్తులు సమర్పించాలని బిసి అభివృద్ధి అధికారి జ్యోతి ఆ ప్రకటనలో కోరారు.

# వీర వనిత చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి స్ఫూర్తిదాయకం

**జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిణి జ్యోతి**

**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్–10 ( భద్రాద్రి న్యూస్):–**



వీర వనిత చాకలి ఐలమ్మ ప్రదర్శించిన పోరాట స్ఫూర్తి స్ఫూర్తిదాయకమని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిణి జి. జ్యోతి అన్నారు. స్థానిక వైరా రోడ్డులోని ప్రభుత్వ వైద్య కళాశాల ఎదురుగా ఉన్న వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద గురువారం జిల్లా వెనక బడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిణి పాల్గొని చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిణి మాట్లాడుతూ సమాజంలోని అసమానత్వానికి ఎదురొడ్డి నిర్భయంగా పోరాటం చేసిన వీరనారి చాకలి ఐలమ్మ అని, జమీందార్ల పాలనలో వెట్టిచాకిరికి వ్యతిరేకంగా అనేక సంఘాలలో ఆమె స్ఫూర్తి నింపారని అన్నారు. చాకలి ఐలమ్మ సంఘ సేవకురాలిగా, భూ, సాయుధ రైతాంగ పోరాటంలో ప్రదర్శించిన పోరాట పటిమతో వీర వనితగా చరిత్రలో నిలిచి, ప్రతి ఒక్కరికి స్ఫూర్తిగా నిలిచారని తెలిపారు. సమాజహితం కొరకు పోరాడిన మహనీయుల స్ఫూర్తి, వారి త్యాగాలు, గొప్పతనం ప్రజలకు తెలిసేందుకు రాష్ట్ర ప్రభుత్వం వారి వర్ధంతిని అధికారికంగా నిర్వహిస్తుందని అన్నారు. చాకలి ఐలమ్మ కు గుర్తింపు అందించడంలో భాగంగా కోఠిలోని మహిళ యూనివర్సిటీకి ప్రభుత్వం చాకలి ఐలమ్మ పేరు పెట్టిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ముదిగొండ సొసైటీ చైర్మన్ ఎలగొండ స్వామి, రజక కులసంఘ నాయకులు, బిసి కుల సంఘ నాయకులు జక్కుల వెంకటరమణ, తమ్మరపు బ్రహ్మం, మాచర్ల యెలాద్రి, కోడి లింగయ్య, నట్టు వెంకటేశ్వర్లు, కత్తి నెహ్రూగౌడ్, మునిగ కోటేశ్వరరావు, ఎల్లురి విజయ్ కుమార్, ఎస్ కే సయ్యద్ బాషా, వల్లపు సోమరాజు, అప్పారావు, ఉపేందర్, పడిగల కృష్ణవేణి, రమాదేవి, బాబురావు, సత్యనారాయణ, హనుమంతు రావు, వెంకన్న, రమణ కుమార్, సహాయ వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారులు, ఖమ్మం జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ కార్యాలయం సిబ్బంది, వసతిగృహ సంక్షేమ అధికారులు, రజక సంఘ నాయకులు, ప్రజలు, పాల్గొన్నారు.

# జిల్లా ప్రజలకు ఆధార్ సేవలు మరింత చేరువ





**నూతన**

**ఆధార్ కేంద్రాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ అంకిత్**

**రోజుకు 300--400 మందికి సేవలు**

**ఆన్‌లైన్‌లో ముందస్తు టోకెన్ బుకింగ్ సదుపాయం**

**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 10( భద్రాద్రి న్యూస్):–**

కొత్తగూడెం పట్టణంలోని పాత కొత్తగూడెం మెయిన్ హాస్పిటల్ ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆధార్ సేవా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ఆధార్ సేవా కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం కేంద్రంలోని వివిధ విభాగాలను పరిశీలించి, ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చిన సదుపాయాలు, ఆధార్ సేవల నిర్వహణకు ఏర్పాటు చేసిన మౌలిక వసతులు, సాంకేతిక పరికరాలు తదితర వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేంద్రం ద్వారా ప్రజలకు అందుతున్న సేవలు, రోజువారీగా ఎంతమందికి సేవలు అందించగల సామర్థ్యం ఉంది, ప్రజలకు ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు తదితర అంశాలపై అధికారులతో కలెక్టర్ చర్చించారు.

ఆధార్ సేవా కేంద్రం ద్వారా ప్రజలకు కొత్తగా ఆధార్ నమోదు చేయడం, ఆధార్‌లోని వివరాల సవరణ, చిరునామా మార్పు, మొబైల్ నంబర్ అనుసంధానం తదితర ఆధార్ సంబంధిత సేవలను అందించనున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. నూతనంగా ఏర్పాటు చేసిన కేంద్రం ద్వారా రోజుకు సుమారు 300 నుంచి 400 మంది వరకు ప్రజలకు ఆధార్ సేవలు అందించే సామర్థ్యం ఉందని తెలిపారు. దీంతో కొత్తగూడెం పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు ఆధార్ సేవలు మరింత సులభంగా, వేగంగా అందుబాటులోకి రానున్నాయని తెలిపారు .

ఆధార్ సేవలు పొందేందుకు ప్రజలకు ఆన్‌లైన్‌లో ముందస్తు టోకెన్ బుకింగ్ సదుపాయం కూడా అందుబాటులో ఉందని అధికారులు తెలిపారు. ప్రజలు ముందుగానే ఆన్‌లైన్‌లో అపాయింట్‌మెంట్ తీసుకుని నిర్ణీత సమయంలో ఆధార్ సేవా కేంద్రానికి రావడం ద్వారా తమ సమయాన్ని ఆదా చేసుకోవచ్చని సూచించారు.

ఆన్‌లైన్ టోకెన్ బుకింగ్ కోసం UIDAI అధికారిక అపాయింట్‌మెంట్ వెబ్‌సైట్‌ను https://appointments.uidai.gov.in/bookappointment.aspx ద్వారా వినియోగించుకోవచ్చని తెలిపారు.

జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ ఆధార్ ప్రస్తుతం ప్రతి ఒక్కరికీ అత్యంత ముఖ్యమైన గుర్తింపు పత్రంగా మారిందని, అనేక ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలు, బ్యాంకింగ్ తదితర అవసరాలకు ఆధార్ అవసరమవుతున్న నేపథ్యంలో ప్రజలకు ఆధార్ సేవలు సులభంగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవడం ఎంతో ముఖ్యమన్నారు. కొత్తగూడెంలో నూతన ఆధార్ సేవా కేంద్రం అందుబాటులోకి రావడం ద్వారా జిల్లా ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని తెలిపారు.

ఆధార్ సేవల కోసం జిల్లా ప్రజలు హైదరాబాద్ వంటి దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా కొత్తగూడెంలోనే సేవలు పొందే అవకాశం కల్పించినట్లు కలెక్టర్ తెలిపారు . గతంలో ఆధార్‌కు సంబంధించిన వివిధ సేవల కోసం దూర ప్రాంతాలకు వెళ్లడం వల్ల ప్రజలకు ప్రయాణ సమయం, ఖర్చులు పెరిగేవని, ప్రస్తుతం స్థానికంగానే ఆధార్ సేవలు అందుబాటులోకి రావడంతో ఆ ఇబ్బందులు తగ్గుతాయని తెలిపారు. ఆధార్‌కు సంబంధించిన సేవల కోసం ప్రజలు ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కేంద్రానికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సేవలను క్రమబద్ధంగా, పారదర్శకంగా, వేగవంతంగా అందించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ముందస్తు టోకెన్ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేస్తూ ప్రజలు ఎక్కువ సమయం వేచి ఉండకుండా చూడాలని సూచించారు. వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు, చిన్నారులతో వచ్చే తల్లిదండ్రులు తదితరులకు అవసరమైన సహకారం అందించాలని తెలిపారు. ఆధార్ సేవల కోసం వచ్చే ప్రజలకు అవసరమైన పత్రాలు, సేవల విధానం తదితర అంశాలపై స్పష్టమైన సమాచారం అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రజలు మధ్యవర్తులను ఆశ్రయించకుండా అధికారిక ఆధార్ సేవా కేంద్రం ద్వారా సేవలను పొందాలని కలెక్టర్ కోరారు.

# గర్భిణీలు బాలింతలు అంగన్వాడి సేవలను సద్వినియోగం చేసుకోవాలి

**ఐసిడిఎస్ సి డి పి ఓ ఉమా గ్రామ సర్పంచ్ అనురాధ విజ్ఞప్తి**





**కామేపల్లి,సెప్టెంబర్ 10 (భద్రాద్రి న్యూస్):**

గర్భిణీలు బాలింతలు అంగన్వాడి సేవలను సద్వినియోగం చేసుకోవాలని కామేపల్లి ప్రాజెక్ట్ సిడిపిఓ ఉమా కొమ్మినేపల్లి గ్రామ సర్పంచ్ దారావత్ అనురాధ పిలుపునిచ్చారు గురువారం పోషణ మాసం లో భాగంగా కొమ్మినేపల్లి 1 అంగన్వాడీ కేంద్రంలో బాలింతలు తల్లుల సమావేశం ఏర్పాటుచేశారు.ఈ కార్యక్రమంలో పాల్గొని వారు మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు,పిల్లల తల్లిదండ్రులు అంగన్వాడీ కేంద్రం సేవలను వినియోగించుకోవాలని సూచించారు.పోషకాహారం తీసుకోవడం వల్ల తల్లుల ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు.పరిశుభ్రత, జంక్ ఫుడ్ వలన జరిగే నష్టాలను, అంగన్వాడి కేంద్రాల ద్వారా అందించే సేవలను వివరించారు. అందరూ కలిసి పోషణ ప్రతిజ్ఞ చేశారు.అంత ముందు ప్రదర్శన నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ టీ విజయలక్ష్మి, వరలక్ష్మి.అంగన్వాడి టీచర్ అరుణ,గర్భిణీలు, బాలింతలు,పిల్లల తల్లులు తదితరులు పాల్గొన్నారు.

# శిరీష కుటుంబానికి కోటి పరిహారం, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి : సోయం వీరభద్రం డిమాండ్




**భద్రాద్రి న్యూస్ । దమ్మపేట । సెప్టెంబర్ 10**

దమ్మపేట మండలానికి చెందిన జిల్లా ఆదివాసీ నాయకులు సోయం వీరభద్రం ఆదివాసీ యువ నర్సు ఉకే శిరీష పెద్దకర్మకు హాజరై నివాళులర్పించారు. శిరీష సమాధి వద్ద పుష్పాంజలి ఘటించి, కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం కల్పించారు. శిరీషకు న్యాయం చేయాలని పాదయాత్ర చేస్తున్న ఆదివాసీ జాక్ చైర్మన్ చుంచు రామకృష్ణ బృందానికి సంఘీభావం తెలిపారు. శిరీష మృతికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రైమ్ కేర్ ఆసుపత్రి యాజమాన్యంపై చర్యలు తీసుకుని ఆసుపత్రిని సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. శిరీష కుటుంబానికి రూ.కోటి పరిహారం, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి నిర్మాణం పూర్తి చేసి ఇవ్వాలని సోయం వీరభద్రం కోరారు.

# ఖాకీ వెనుక.. మానవీయత!

**గిరిజన బిడ్డగా ఎదిగి.. ప్రజాసేవే ధ్యేయంగా సీఐ నూనావత్ సాగర్**



**కారేపల్లి, సెప్టెంబర్ 10 (భద్రాద్రి న్యూస్ రాములు):** ఖాకీ అంటే కేవలం క్రమశిక్షణ.. విధి నిర్వహణ మాత్రమే కాదు.. అవసరంలో ఉన్నవారికి భరోసా కల్పించే బాధ్యత కూడా. గిరిజన కుటుంబంలో జన్మించి ఎన్నో సవాళ్లను అధిగమిస్తూ పోలీసు అధికారిగా ఎదిగిన సీఐ నూనావత్ సాగర్.. తన మూలాలను మరువకుండా ప్రజల పట్ల మానవీయ దృక్పథంతో ముందుకు సాగుతున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సామాన్య కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన ఆయన.. ప్రజల కష్టాలను దగ్గరగా అర్థం చేసుకుంటూ, ఆపదలో ఉన్న వారికి తన వంతు సహాయం అందించడాన్ని సేవగా భావిస్తున్నారని సన్నిహితులు చెబుతున్నారు. నిరుపేదలు, గిరిజనులు, అణగారిన వర్గాలకు అవసరమైన సమయంలో స్పందిస్తూ వారికి అండగా నిలవడం ఆయనలోని మానవీయ కోణాన్ని చాటుతోంది. తెలంగాణ గడ్డపై సామాజిక న్యాయం, ప్రజల హక్కుల కోసం జరిగిన అనేక పోరాటాల స్ఫూర్తిని తీసుకుని.. సమాజానికి తన వంతుగా సేవ చేయాలనే ఆలోచనతో సీఐ సాగర్ ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది. పోలీసు అధికారిగా చట్టాన్ని అమలు చేయడంతో పాటు.. ప్రజలకు అందుబాటులో ఉండటం, వారి సమస్యలను వినడం, అవసరమైన సమయంలో భరోసా కల్పించడం తన బాధ్యతగా భావిస్తున్నారని సమాచారం.

**విధుల్లో కఠినత్వం.. ప్రజల పట్ల మానవీయత**

పోలీసు విధుల్లో క్రమశిక్షణకు ప్రాధాన్యం ఇస్తూనే.. ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగడం, సమస్యలను అర్థం చేసుకుని స్పందించడం సీఐ సాగర్ ప్రత్యేకతగా స్థానికులు పేర్కొంటున్నారు. ఖాకీ దుస్తులు అధికారానికి ప్రతీక అయినప్పటికీ.. ఆ ఖాకీ వెనుక మానవీయత ఉండాలనే భావనతో ఆయన పనిచేస్తున్నారని చెబుతున్నారు. గిరిజన బిడ్డగా పుట్టి.. ఖాకీ అధికారిగా ఎదిగి.. ప్రజల కష్టాల్లో తోడుగా నిలవాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్న సీఐ నూనావత్ సాగర్ సేవా దృక్పథం పోలీసు శాఖలో మానవీయతకు మరో కోణాన్ని చూపిస్తోంది.

మూలాలను మరువని మనసు.. ప్రజలకు భరోసా ఇచ్చే ఖాకీ.. సేవనే బాధ్యతగా భావించే సీఐ నూనావత్ సాగర్

# ప్రతి ఒక్కరూ సేవా భావం అలవర్చుకోవాలి

**డాక్టర్ సెల్ అధ్యక్షులు కాంగ్రెస్ నాయకులు డాక్టర్ కాపా మురళీకృష్ణ**

**వృద్ధులకు దుప్పట్లు, పేద విద్యార్థికి సైకిల్ వితరణ**






**వైరా, సెప్టెంబర్ 10, (భద్రాద్రి న్యూస్)**

వైరా నియోజకవర్గ పట్టణ మున్సిపాలిటీ గ్రేట్ విజన్ క్లబ్ లయన్స్ క్లబ్ ఆఫ్ అవని సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా జి ఈ టి కోఆర్డినేటర్ ఉండ్రు శ్యాంబాబు, వరలక్ష్మీ దంపతుల పెళ్లిరోజు సందర్భంగా, కుమారుడు అజయ్ బాబు పుట్టినరోజు పురస్కరించుకొని గురువారం 20వ వార్డులో వృద్ధులకు దుప్పట్లు, రమ అనే పేద విద్యార్థినికి సైకిల్ ను అందించారు. అనంతరం పెళ్లి రోజు, పుట్టినరోజుల వేడుకలను పురస్కరించుకొని కేక్ కట్ చేసి, వైరా గ్రేట్ విజన్ లయన్స్ క్లబ్ అవని సభ్యులు, మిత్రులు, శ్రేయోభిలాషులు శుభాకాంక్షలు తెలియజేశారు. తదనంతరం ఫాస్ట్ జిల్లా గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రతి లయన్ మెంబర్ తన సంపాదనలో సేవా కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ప్రతి మనిషి సేవాభావం పెంపొందించుకోవాలని, సమాజ సేవలో పాలుపంచుకోవాలని, సమాజ సేవకు పాటుపడాలని ఆయన సూచించారు. పలు సేవా కార్యక్రమాలను నిర్వహించిన శ్యాం బాబు దంపతులకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎల్ సి ఐ ఎఫ్ కోఆర్డినేటర్ లగడపాటి ప్రభాకర్ రావు, జోన్ చైర్మన్ తోటకూర శ్రీకాంత్, జిల్లా క్యాబినెట్ జాయింట్ ట్రెజరర్ పెనుగొండ ఉపేందర్ రావు, రీజియన్ సెక్రెటరీ వై బుచ్చి రామారావు, గ్రేట్ విజన్ క్లబ్ అధ్యక్షులు ఉయ్యూరు రామకృష్ణ, సెక్రెటరీ మచ్చ రామారావు, అవని క్లబ్ అధ్యక్షులు గద్దె నీరజ, సెక్రెటరీ సుగ్గల మాధవి, సభ్యులు పోలా శ్రీనివాసరావు, నాల నాగమల్లేశ్వరి, రాయల విజయలక్ష్మి, పొదిలి కల్పన, సునీత, శైలజ, పువ్వాళ రాము, బిక్కు క్లబ్బుల సభ్యులు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# రైతు కూలీల గళానికి ఖమ్మం వేదిక!

**ఏఐకేఎంఎస్ జాతీయ మహాసభలకు మాదారం నుంచి పిలుపు**

**28న భారీ బహిరంగ సభ.. 29, 30న అఖిలభారత నాలుగో మహాసభలు**

**రైతు--కార్మిక సమస్యలపై భవిష్యత్ పోరాటాలకు కార్యాచరణ: వై. ప్రకాష్**




**కారేపల్లి, సెప్టెంబర్ 10 (భద్రాద్రి న్యూస్ రాములు):** రైతు, వ్యవసాయ కూలీలు, కార్మికుల సమస్యలపై పోరాటాలకు మరింత పదును పెట్టేందుకు ఖమ్మం వేదికగా అఖిలభారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) నాలుగో జాతీయ మహాసభలు నిర్వహించనున్నట్లు ఆ సంఘం ఖమ్మం జిల్లా కార్యదర్శి వై. ప్రకాష్ తెలిపారు. మహాసభల ప్రచారంలో భాగంగా కారేపల్లి మండలం మాదారం గ్రామంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వై. ప్రకాష్ మాట్లాడుతూ రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలు, వ్యవసాయ రంగానికి సంబంధించిన విధానాలు, కార్మికుల హక్కులపై మహాసభల్లో విస్తృతంగా చర్చించనున్నట్లు తెలిపారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడం, కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడం, స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయడం వంటి డిమాండ్లపై పోరాటాలను కొనసాగిస్తామని పేర్కొన్నారు. రైతులు, కార్మికులు గతంలో నిర్వహించిన ఉద్యమాలను ఆయన ప్రస్తావిస్తూ.. వ్యవసాయ చట్టాలు, లేబర్ కోడ్లు, విద్యుత్ బిల్లు తదితర అంశాలపై జరిగిన పోరాటాలు రైతు--కార్మిక ఐక్యతకు నిదర్శనమని అన్నారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని ఇచ్చిన హామీల అమలుపైనా ప్రభుత్వాలను ప్రశ్నించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కార్మికులకు కనీస వేతన చట్టం అమలు సహా రైతు, కూలీ, కార్మికుల సమస్యలపై భవిష్యత్ పోరాటాలకు దిశానిర్దేశం చేసేలా జాతీయ మహాసభల్లో కార్యాచరణ రూపొందించనున్నట్లు వై. ప్రకాష్ తెలిపారు. ఖమ్మం సభకు భారీగా తరలిరావాలి ఈ నెల 28న ఖమ్మంలో నిర్వహించే భారీ బహిరంగ సభకు, అలాగే 29, 30 తేదీల్లో జరిగే అఖిలభారత నాలుగో జాతీయ మహాసభలకు రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు, విద్యార్థులు, మేధావులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని వై. ప్రకాష్ పిలుపునిచ్చారు. మాదారంలో జరిగిన వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ నాయకులు కోయిల శ్రీనివాస్, కావేటి నాగేశ్వరరావు, గద్దం వెంకన్న, నరేష్, నరసింహారావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పాలు రాకముందే.. గ్రామాలకు మద్యం చేరుతోందా?




**సింగరేణిలో తెల్లవారుజామునే సరఫరాపై ఆరోపణలు..**

**రూ.60 వరకు అదనపు వసూళ్ల ఫిర్యాదులు**

**నాలుగు మద్యం దుకాణాలపై ఆరోపణలు.. అధికారుల నిఘాపై ప్రజల ప్రశ్నలు**

**కారేపల్లి, సెప్టెంబర్ 10 (భద్రాద్రి న్యూస్ ):** సింగరేణి మండలంలో మద్యం విక్రయాలపై వస్తున్న ఫిర్యాదులు, అధిక ధరల వసూళ్ల ఆరోపణలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. నిత్యావసర వస్తువులు చేరకముందే.. తెల్లవారుజామునే గ్రామాలకు మద్యం చేరుతోందా? అనే ప్రశ్నలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. మండల పరిధిలోని నాలుగు మద్యం దుకాణాల నుంచి ఉదయం 5.30 గంటల నుంచే ఆటోల ద్వారా గ్రామాలకు మద్యం తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

**క్వార్టర్‌పై రూ.60 వరకు అదనపు భారం?**

మద్యం దుకాణాల్లో క్వార్టర్ బాటిల్‌పై ప్రభుత్వ ధరకు అదనంగా రూ.20 వరకు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అదే మద్యం బెల్టు దుకాణాల్లో మరో రూ.40 వరకు అధిక ధరకు విక్రయిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఈ ఆరోపణలు నిజమైతే ఒక్క క్వార్టర్‌పై వినియోగదారుడికి రూ.60 వరకు అదనపు భారం పడే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**తెల్లవారుజామునే ఆటోల ద్వారా సరఫరా?**

సింగరేణి మండలంలోని 41 గ్రామపంచాయతీల పరిధిలోని గ్రామాలకు ఆటోల ద్వారా మద్యం తరలిస్తున్నారనే ఆరోపణలు స్థానికుల నుంచి వస్తున్నాయి. ముఖ్యంగా తెల్లవారుజామున 5.30 గంటల నుంచే సరఫరా జరుగుతోందనే ఫిర్యాదులపై సంబంధిత అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. ఈ వ్యవహారంపై పలుమార్లు సంబంధిత అబ్కారీ అధికారులకు, కారేపల్లి అబ్కారీ శాఖ సీఐకి ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు కనిపించడం లేదని కొందరు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ ఆరోపణలపై అధికారుల అధికారిక వివరణ వెలువడాల్సి ఉంది.

**అధికారుల నిఘా ఎక్కడ?**

మండల కేంద్రానికి, పోలీస్‌స్టేషన్‌కు సమీపంలోనే అధిక ధరల వసూళ్లు, గ్రామాలకు అక్రమంగా మద్యం తరలింపు జరుగుతోందనే ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో అధికారులు స్పందించాల్సిన అవసరం ఉందని ప్రజలు అంటున్నారు. నాలుగు మద్యం దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి.. ప్రభుత్వ ధరలకే మద్యం విక్రయిస్తున్నారా? నిబంధనలకు విరుద్ధంగా తెల్లవారుజామున విక్రయాలు లేదా సరఫరా జరుగుతోందా? బెల్టు దుకాణాల్లో అధిక ధరలకు విక్రయిస్తున్నారా? అనే అంశాలను అధికారులు పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు.

**యువత భవిష్యత్తుపై ఆందోళన**

గ్రామాల్లో మద్యం సులభంగా అందుబాటులోకి రావడం వల్ల యువతతో పాటు పేద కుటుంబాలపై ప్రతికూల ప్రభావం పడుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తెల్లవారుజామునే గ్రామాలకు మద్యం చేరుతోందనే ఆరోపణలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, నిబంధనలు ఉల్లంఘిస్తున్నట్లు తేలితే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**ఫిర్యాదులపై అధికారులు స్పందిస్తారా?**

సింగరేణి మండలంలోని నాలుగు మద్యం దుకాణాలపై వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో అధికారులు ఇప్పటికైనా క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తారా? అధిక ధరల వసూళ్ల ఆరోపణలపై వాస్తవాలను బయటపెడతారా? తెల్లవారుజామున గ్రామాలకు మద్యం సరఫరా జరుగుతోందనే ఆరోపణలకు అడ్డుకట్ట వేస్తారా? అనేది ఇప్పుడు మండల ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది.

# పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహం

**జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్**

**కుడా కార్యాలయంలో టి-ప్రైడ్, టీజీ-ఐపాస్ పథకాల కింద పారిశ్రామిక ప్రోత్సాహకాలపై సమీక్ష**

పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రోత్సాహాన్ని అందిస్తుందని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. గురువారం, జిల్లా పారిశ్రామిక ప్రోత్సాహక కమిటీ టీజీ-ఐపాస్ కమిటీ సమావేశం హనుమకొండ కుడా కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్, కమిటీ చైర్‌పర్సన్ చాహత్ బాజ్‌పాయ్ అధ్యక్షతన నిర్వహించారు. జిల్లాలో పరిశ్రమల స్థాపన, పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, వివిధ శాఖల అనుమతులకు సంబంధించిన దరఖాస్తులపై సమావేశంలో సమీక్షించారు. పరిశ్రమల ఏర్పాటుకు కావలసిన అనుమతులను సంబంధిత శాఖల అధికారులు త్వరితగతిన ఇవ్వాలని కలెక్టర్ అన్నారు. టీజీ ఐపాస్ కింద వచ్చిన దరఖాస్తులను కమిటీ పరిశీలించింది. నిబంధనల ప్రకారం అర్హత సాధించిన పలు పరిశ్రమల యూనిట్లకు కమిటీ ఆమోదం మంజూరు చేశారు. కాలుష్య నియంత్రణ మండలి (పిసిబి), విద్యుత్ శాఖ, ఎస్సీ కార్పొరేషన్, కుడా, టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్, ఫ్యాక్టరీల ఇన్‌స్పెక్టర్, గ్రౌండ్‌వాటర్ శాఖ, డి ఐ సి సి ఐ ప్రతినిధులు సహా మొత్తం 15 మంది కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# SIR హియరింగ్‌కు వేళాయె.. ఓటర్లు అప్రమత్తం!

**భాగ్యనగర్ తండాలో 35, 36 కేంద్రాల విచారణ పూర్తి
రేపు 38, 39 కేంద్రాలపై హియరింగ్.. సంబంధిత ఓటర్లు తప్పక హాజరు కావాలి**

**కారేపల్లి, సెప్టెంబర్ 10 (భద్రాద్రి న్యూస్ ):**
ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (SIR) కార్యక్రమంలో భాగంగా సింగరేణి మండలం భాగ్యనగర్ తండా గ్రామపంచాయతీలో 35, 36 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఎనామిలీస్‌పై గురువారం హియరింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంఆర్ఓ ఓరుగంటి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో హియరింగ్ ప్రక్రియను నిర్వహించి పూర్తి చేశారు. ఈ కార్యక్రమానికి భాగ్యనగర్ తండా సర్పంచ్ బానోత్ హీరాలాల్, పంచాయతీ కార్యదర్శి పెంద్ర అనిల్ కుమార్ హాజరై కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ూ×=లో భాగంగా ఓటర్ల వివరాలకు సంబంధించిన అంశాలను పరిశీలించి, సంబంధిత హియరింగ్ ప్రక్రియను పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు.

**రేపు 38, 39 కేంద్రాలపై హియరింగ్**

SIR కార్యక్రమంలో భాగంగా రేపు 38, 39 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఎనామిలీస్‌పై హియరింగ్ నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. హియరింగ్ తేదీ ఉన్న సంబంధిత ఓటర్లు నిర్ణీత సమయంలో తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు. తమకు సంబంధించిన ఓటరు వివరాల్లో ఏవైనా అభ్యంతరాలు



లేదా మార్పులు ఉంటే హియరింగ్ సందర్భంగా అధికారుల దృష్టికి తీసుకురావాలని, అవసరమైన ఆధారాలు ఉంటే సమర్పించాలని కోరారు.

**ఓటర్లు నిర్లక్ష్యం చేయొద్దు**

SIR ప్రక్రియలో భాగంగా హియరింగ్ తేదీ ఉన్న ఓటర్లు తప్పనిసరిగా హాజరు కావాలని అధికారులు సూచించారు. హియరింగ్‌కు హాజరుకాకపోతే తమ ఓటరు వివరాల పరిశీలన ప్రక్రియపై ప్రభావం పడే అవకాశం ఉన్నందున ముందుగానే అప్రమత్తంగా ఉండాలని కోరారు. రేపటి హియరింగ్‌కు సంబంధించిన ఓటర్లు నిర్ణీత సమయానికి హాజరై తమ ఓటరు వివరాలను పరిశీలించుకోవాలని అధికారులు సూచించారు. ఓటు హక్కుకు సంబంధించిన అంశం కావడంతో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకుండా హియరింగ్ ప్రక్రియలో పాల్గొనాలని కోరారు.

# మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి.. నార్కోటిక్స్ సిఐ శ్రీకాంత్



మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి అని నార్కోటిక్స్ విభాగం సిఐ శ్రీకాంత్ అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల (కో-ఎడ్యుకేషన్) హనుమకొండలో నార్కోటిక్స్ విభాగం మరియు ఎన్.ఎస్.ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో భూపాలపల్లి జిల్లా జూనియర్ అండ్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యార్థులు మత్తు బాధలు దూరంగా ఉండాలని, మత్తు పదార్థాలకు బానిస అయితే మానసికంగా పిచ్చి వాళ్ళు తయారవుతారని, మత్తు పదార్థాలు వాడిన,వెంబడి తీసుకు వెళ్లిన, సరఫరా చేసిన, సహకారం అందించిన శిక్షకు గురవుతారని, ఈ మధ్యకాలంలో గంజాయి కేసులు ఎక్కువగా అవుతున్నాయని వీటికి ఇంటర్మీడియట్, డిగ్రీ విద్యార్థులు బానిస అవుతున్నారని ఇది కేవలం పట్టణాల్లోనే కాక ఈ మధ్యకాలంలో పల్లెటూర్లలో కూడా వ్యాపించిందని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భూపాల్ పల్లి డి.ఐ.ఈ.ఓ వెంకన్న, హనుమకొండ జూనియర్ కళాశాల సీనియర్ అధ్యాపకులు డాక్టర్ ఎం సాంబశివయ్య, ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్ .రాజ్ కుమార్, నార్కోటిక్స్ విభాగము ఎస్సై మొగిలి, హెడ్ కానిస్టేబుల్ కే,శ్రీనివాస్, కానిస్టేబుల్ బి శ్రీనివాస్ జి. మనోహర్ పాల్గొన్నారు.

# వినాయకుడి మట్టి విగ్రహాలనే పూజిద్దాం హిందువులు తన తన ధర్మాన్ని కాపాడాలి

**– బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యుడు జాలే శ్రీను యాదవ్**

**కామేపల్లి,సెప్టెంబర్ 10(భద్రాద్రి న్యూస్):–**
వినాయకుడి మట్టి విగ్రహాన్ని పూజించాలని తన తన ధర్మాన్ని హిందువులు కాపాడాలని.బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యుడు జాలే శ్రీను యాదవ్ అన్నారు విఘ్నేశ్వరుడి కృపాకటాక్షాలతో కామేపల్లి మండల ప్రజలంతా సుఖసంతోషాలతో విలసిల్లాలని బిజెపి జిల్లా నాయకుడు కార్యవర్గ సభ్యుడు జాలే శ్రీను యాదవ్ ఆకాంక్షించారు. వినాయక చవితి సందర్భంగా , కామేపల్లి మండల ప్రజలకు,భక్తులకు ఆయన ముందస్తు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.సకల విఘ్నాలను తొలగించే లంబోదరుని ఆశీస్సులతో ప్రతి ఇంట్లో ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు నిండాలని కోరుకున్నారు. మన సంస్కృతీ సాంప్రదాయాలకు ప్రతీక అయిన గణేష్ ఉత్సవాలను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని పిలుపునిచ్చారు. “మట్టి నుండి పుట్టిన దేహం తిరిగి మట్టిలోనే కలిసిపోతుంది” అనే సృష్టి ధర్మాన్ని ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలన్నారు.పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతీ ఇంటి ముందు మట్టి గణపతులనే ప్రతిష్టించి పూజించాలని విజ్ఞప్తి చేశారు.ఉత్సవాల కమిటీ నిర్వహణలో పోలీస్ రెవెన్యూ,విద్యుత్ శాఖ గ్రామ సర్పంచ్ పంచాయతీ సెక్రెటరీ అధికారులకు పూర్తిస్థాయిలో సహకరిస్తూ... శాంతియుత, ప్రశాంత వాతావరణంలో వేడుకలను విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీలను కోరారు.



# రాయపర్తిలో సేవా కార్యక్రమం సర్పంచ్ ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంప్



రాయపర్తి మండల కేంద్రంలో గురువారం మెగా హెల్త్ క్యాంప్ ఘనంగా ప్రారంభమైంది. స్థానిక సర్పంచ్ గ్యారే మహేంద్ర బిక్షపతి ఈ శిబిరాన్ని ప్రారంభించారు. గ్రామ పౌరులకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ క్యాంప్ ను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మార్వో, పంచాయతీ సెక్రెటరీ హాజరయ్యారు. గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని క్యాంప్ ను విజయవంతం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మహేంద్ర బిక్షపతి మాట్లాడుతూ.. “గ్రామంలోని ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలి. డబ్బులు లేక వైద్యం చేయించుకోలేని పరిస్థితి రాకూడదు. అందుకే ఉచితంగా ఈ మెగా హెల్త్ క్యాంప్ ను ఏర్పాటు చేశాం. ముఖ్యంగా కంటి పరీక్షలు, బీపీ, షుగర్ తదితర పరీక్షలు నిర్వహిస్తున్నాం” అని అన్నారు. ఈరోజు సుమారుగా 250 మంది గ్రామస్తులు బిపి షుగర్ ఈసీజీ కంటి పరీక్షలు చేయించుకున్నారని తెలియజేశారు. ఈ క్యాంప్ లో వచ్చిన ప్రజలకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. రాబోయే రోజుల్లో ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని చేపడతామని నిర్వాహకులు తెలిపారు.

# ఆర్ అండ్ బి పంచాయతీ రాజ్ అధికారుల నిర్లక్ష్యం

**కుంగిన కల్వర్టుతో గగ్గోలు పెడుతున్న గ్రామీణులు
అధికారుల సమన్వయ లోపం..
కెప్టెన్ బంజారా -- మర్రిగూడెం మార్గంలో నిత్యం ప్రాణసంకటం**

**కామేపల్లి,సెప్టెంబర్ 10(భద్రాద్రి న్యూస్):**
గ్రామాల్లో రోడ్లు,వంతెనల నిర్వహణ బాధ్యత కలిగిన ఆర్&బీ, పంచాయతీ రాజ్ శాఖ అధికారుల తీవ్ర నిర్లక్ష్యానికి కామేపల్లి మండలం కెప్టెన్ బంజారా -- మర్రిగూడెం రహదారి నిలువుటద్దంగా మారింది. పంచాయతీ రాజ్ పరిధిలోని రహదారి, ఆర్‌డబీ,వంతెనల సమన్వయ లోపం వల్ల మూలమలుపు వద్ద ఉన్న పంటకాలువ మోరి (కల్వర్టు) పూర్తిగా కుంగిపోయి పెద్ద గుంత ఏర్పడింది. రోడ్డు సగానికి పైగా ధ్వంసమై ప్రమాదకరంగా మారినా ఏ ఒక్క శాఖ అధికారి కూడా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడంపై స్థానిక గ్రామీణ ప్రజలు రైతులు ప్రయాణికులు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తుతున్నారు. ఈ రోడ్డుపై ప్రతిరోజూ వందలాది బైకులు, ట్రాక్టర్లు, వ్యవసాయ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి.ఏ క్షణాన ఏ ప్రమాదం ముంచుకొస్తుందో తెలియక ప్రయాణికులు అల్లాడిపోతున్నారు.





శాఖల మధ్య బాధ్యతల నెట్టివేత వల్లే మరమ్మత్తులు మూలనపడ్డాయని, కనీసం ప్రమాద హెచ్చరిక బోర్డులు కానీ, రేడియం స్టిక్కర్లు కానీ ఏర్పాటు చేయకపోవడం అధికారుల బాధ్యతారాహిత్యానికి పరాకాష్ట అని వాహనదారులు మండిపడుతున్నారు. ఏదైనా పెద్ద ప్రమాదం జరిగి ప్రాణనష్టం సంభవించాకే అధికారులు స్పందిస్తారా? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పంచాయతీ రాజ్, ఆర్&బీ, ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, సమన్వయంతో కుంగిన కల్వర్టును పునర్నిర్మించి రహదారికి మరమ్మత్తులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో రహదారిపైనే బైఠాయించి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరిస్తున్నారు

# రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు పెద్దాపూర్ ఎం జె పి విద్యార్థులు ముగ్గురు ఎంపిక

మహాత్మ జ్యోతిబా పూలే పెద్దాపూర్ బాలికల పాఠశాల విద్యార్థులు కబడ్డీలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర యుస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 8న నీరుకుళ్ల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ఐ మండల స్థాయి క్రీడా పోటీల్లో సీనియర్, జూనియర్ విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీల్లో రాణించి జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించారు. హనుమకొండలోని జేఎన్ఎస్‌లో గురువారం నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లోనూ పెద్దాపూర్ విద్యార్థులు సత్తా చాటారు. అండర్–17 విభాగంలో వి.పల్లవి, పి.అంజన, అండర్–19 విభాగంలో ఏ.పల్లవి విజయం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ప్రిన్సిపాల్ అనిత మాట్లాడుతూ విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం పాఠశాలకు గర్వకారణమన్నారు. విద్యార్థులు ప్రతిరోజూ క్రమం తప్పకుండా సాధన చేస్తూ తమ క్రీడా నైపుణ్యాలను మెరుగుపరుచుకున్నారని తెలిపారు. వారి కృషి, పట్టుదలే ఈ విజయానికి కారణమన్నారు. రాష్ట్ర స్థాయిలోనూ రాణించి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

# చుంచుపల్లి కి విజయ మినీ పాల శీతలీకరణ కేంద్రం





**లక్ష్మీదేవిపల్లిలోని కేంద్రాన్ని చుంచుపల్లికి మార్చే అంశంపై క్షేత్రస్థాయి పరిశీలన**

**చుంచుపల్లి, సెప్టెంబర్ 10 (భద్రాద్రి న్యూస్):-**

చుంచుపల్లిలో విజయ డెయిరీ కోసం ఇప్పటికే స్థలం కేటాయించినందున, ఆ స్థలంలో విజయ మినీ పాల శీతలీకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేసేలా చర్యలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు లక్ష్మీదేవిపల్లిలోని ప్రస్తుత విజయ మినీ పాల శీతలీకరణ కేంద్రం ఉన్న స్థలాన్ని అందుబాటులోకి తీసుకురావాల్సి ఉన్నందున, కేంద్రాన్ని చుంచుపల్లికి మార్చే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఇందులో భాగంగా లక్ష్మీదేవిపల్లి మండల కేంద్రంలోని విజయ మినీ పాల శీతలీకరణ కేంద్రాన్ని గురువారం కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి, కేంద్రాన్ని చుంచుపల్లికి మార్చే అంశంపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కేంద్రంలో ప్రతిరోజూ జరుగుతున్న పాల సేకరణ, శీతలీకరణ ప్రక్రియ, అందుబాటులో ఉన్న మౌలిక వసతులు, పరికరాల పనితీరు తదితర వివరాలను కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేంద్రం పరిధిలో సుమారు 30 గ్రామాలకు చెందిన 400 మంది రైతులు పాల సేకరణకు అనుసంధానమై ఉన్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం రోజుకు సుమారు 500 లీటర్ల వరకు పాలు సేకరిస్తుండగా, పాల ఉత్పత్తి అధికంగా ఉండే సీజన్‌లో రోజువారీ సేకరణ సుమారు 4,000 లీటర్ల వరకు పెరుగుతుందని వివరించారు. ఉదయం, సాయంత్రం నిర్ణీత సమయాల్లో పాలను సేకరించి ఖమ్మం డెయిరీకి తరలిస్తున్నట్లు తెలిపారు.

అనంతరం కలెక్టర్ కేంద్రంలోని కూలింగ్ ట్యాంక్, స్టోరేజ్ వ్యవస్థ, కంప్రెసర్ తదితర పరికరాలను పరిశీలించారు. ప్రస్తుత భవనం, పరికరాల పరిస్థితిని పరిశీలించిన కలెక్టర్, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా కేంద్రాన్ని ఏర్పాటు చేయాల్సిన అంశంపై అధికారులతో చర్చించారు. చుంచుపల్లిలో విజయ మినీ పాల శీతలీకరణ కేంద్రం ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే స్థలాన్ని గుర్తించి, విజయ డెయిరీ అధికారులకు సూచించినందున, కేంద్రం ఏర్పాటుకు అవసరమైన తదుపరి చర్యలను త్వరితగతిన చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. రైతులకు సౌకర్యవంతంగా ఉండే విధంగా కేంద్రాన్ని ఏర్పాటు చేసి, పాల సేకరణ మరియు శీతలీకరణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కేంద్రాన్ని మార్చే సమయంలో పాల సేకరణకు ఎలాంటి అంతరాయం కలగకుండా, రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ముందస్తు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు. నూతన కేంద్రం అందుబాటులోకి వచ్చిన తర్వాత రైతులకు మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుతో ఈ ప్రాంత విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు అందుబాటులోకి వస్తాయని, అదే సమయంలో విజయ మినీ పాల శీతలీకరణ కేంద్రాన్ని చుంచుపల్లిలో ఏర్పాటు చేయడం ద్వారా రైతులకు కూడా ప్రయోజనం కలిగేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, విజయ మినీ పాల శీతలీకరణ కేంద్రాన్ని చుంచుపల్లిలో ఏర్పాటు చేసే పనులను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. ఈ పరిశీలనలో లక్ష్మీదేవిపల్లి తహసీల్దార్ శిరీష, విజయ డెయిరీ మేనేజర్ సౌజన్య, సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవ మండపాల నిర్వాహకులు నిబంధనలు తప్పక పాటించాలి





**కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ**

**కొత్తగూడెం టౌన్ ,సెప్టెంబర్ 10 (భద్రాద్రి న్యూస్):-**

గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతమైన వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు మండపాల నిర్వాహకులు పోలీస్, మున్సిపల్ శాఖల నిబంధనలు మరియు సూచనలను తప్పనిసరిగా పాటించాలని కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ సూచించారు.గణేష్ మండపం ఏర్పాటు చేయడానికి ముందుగా సంబంధిత పోలీస్, మున్సిపల్ అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. రోడ్లపై, ఇరుకైన వీధుల్లో, వివాదాస్పద స్థలాల్లో లేదా ప్రజల రాకపోకలకు ఆటంకం కలిగించే ప్రదేశాల్లో మండపాలు ఏర్పాటు చేయకూడదని సూచించారు. మండపం, స్టేజ్, స్వాగత తోరణాలు ట్రాఫిక్‌కు, అత్యవసర వాహనాల రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలిగించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. మండపం వద్ద ప్రవేశం, నిష్క్రమణ మార్గాలను వేర్వేరుగా ఏర్పాటు చేయాలని, వాహనాల పార్కింగ్‌ను నిర్ణయించిన ప్రదేశాల్లో మాత్రమే ఏర్పాటు చేయాలని సూచించారు. పెద్ద మండపాల వద్ద సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని, రాత్రి సమయంలో బాధ్యత కలిగిన నిర్వాహకులు, వాలంటీర్లు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని తెలిపారు.అగ్ని ప్రమాదాల నివారణకు నీటి డ్రమ్ములు, ఇసుక బస్తాలు, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు, అందుబాటులో సిద్ధంగా ఉంచాలని సూచించారు. విద్యుత్ వైరింగ్‌ను నిపుణుల ద్వారా సురక్షితంగా చేయించుకోవాలని, అనుమతి లేకుండా విద్యుత్ కనెక్షన్లు వినియోగించకూడదని స్పష్టం చేశారు. లౌడ్‌స్పీకర్లు, సౌండ్ సిస్టమ్ వినియోగానికి అవసరమైన అనుమతులు పొందాలని, రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు లౌడ్‌స్పీకర్లు, సౌండ్ సిస్టం వినియోగించకూడదని తెలిపారు. నిర్ణయించిన శబ్ద పరిమితులను పాటించాలని, డీజేలు నిషేధమని సూచించారు. మండపాల వద్ద మద్యం సేవించి గొడవలకు పాల్పడటం, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. విరాళాలను స్వచ్ఛందంగా మాత్రమే స్వీకరించాలని, ఎవరినీ బలవంతం చేయకూడదని సూచించారు. మండపాల చుట్టూ వ్యాపారులు, ఆహార స్టాళ్లు ఏర్పాటు చేసినప్పుడు రహదారులను ఆక్రమించకుండా చూడాలని తెలిపారు. ఇతర మతాల ప్రార్థనా స్థలాలకు సమీపంలో వివాదాలకు దారితీసే విధంగా బ్యానర్లు, పోస్టర్లు, జెండాలు ఏర్పాటు చేయకూడదని, విగ్రహం, మండపం, అలంకరణలు అన్ని వర్గాల ప్రజల మనోభావాలను గౌరవించే విధంగా ఉండాలని సూచించారు. వీలైనంత వరకు పర్యావరణహిత మట్టి విగ్రహాలను వినియోగించాలని కోరారు. విగ్రహ నిమజ్జనం కోసం అధికారులు సూచించిన మార్గాలు, నిమజ్జన కేంద్రాలను మాత్రమే వినియోగించాలని తెలిపారు. నిమజ్జన ఊరేగింపు సమయంలో ట్రాఫిక్, పోలీస్ అధికారులు ఇచ్చే సూచనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని కోరారు. గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా, సామరస్యంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు మండపాల నిర్వాహకులు పోలీస్ శాఖకు పూర్తిగా సహకరించాలని కొత్తగూడెం డీఎస్పీ విజ్ఞప్తి చేశారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీస్ -- 100, ఫైర్ -- 101, అంబులెన్స్ -- 108 నంబర్లను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం త్రీ టౌన్ సిఐ ఇంద్రసేనారెడ్డి, ట్రాఫిక్ ఎస్హెచ్ఓ ప్రవీణ్ కుమార్, ఎస్సై రమేష్, సిబ్బంది పాల్గొన్నారు

# తెలంగాణ పోరాట స్ఫూర్తికి ప్రతీక వీరవనిత చాకలి ఐలమ్మ

**జిల్లా కలెక్టర్ అంకిత్**

**భూమి, భుక్తి కోసం ఆమె చేసిన పోరాటం నేటి తరాలకు స్ఫూర్తిదాయకం**




**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 10 (భద్రాద్రి న్యూస్):-**

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో భూమి, భుక్తి కోసం ధైర్యసాహసాలతో పోరాడిన వీరవనిత చాకలి ఐలమ్మ మహిళా శక్తికి, సామాజిక న్యాయానికి ప్రతీకగా నిలిచారని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. గురు వారం జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని, ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, అణగారిన వర్గాల హక్కుల కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం, త్యాగం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయని అన్నారు. భూమి, భుక్తి కోసం ఆమె చూపిన పోరాటపటిమ నేటికీ ప్రజలకు స్ఫూర్తినిస్తోందని తెలిపారు. ముఖ్యంగా యువత, మహిళలు ఐలమ్మ పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని సామాజిక అభివృద్ధికి, సమానత్వం కోసం కృషి చేయాలని సూచించారు. చాకలి ఐలమ్మ జీవితం స్త్రీ సాధికారతకు, సామాజిక సమానత్వానికి మార్గదర్శకంగా నిలుస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఆమె పోరాటం నుంచి నేటి తరాలు ధైర్యసాహసాలు, మానవ విలువలు, సామాజిక బాధ్యత, న్యాయం వంటి విలువలను అలవరుచుకోవాలని అన్నారు. సమాజంలో అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, డిఆర్ఓ పద్మావతి, కలెక్టరేట్ ఏవో అనంత రామకృష్ణ, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి విజయలక్ష్మి,జిల్లా షెడ్యూల్డు కులముల అభివృద్ధి అధికారి ఎ. శ్రీలత, బీసీ సంఘాల నాయకులునేరెళ్ల రమేష్, అజిత్ కుమార్, రెచర్ల సర్వేశ్వర రావు, కణతాల వసంత రావు, పోగుల లక్ష్మీనారాయణ, చిటికెన ముసలయ్య, ముదిగొండ రాంబాబు, కొదుమూరి సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గొల్లపూడి గ్రామంలో ఘనంగా చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి వేడుకలు



**వైరా, సెప్టెంబర్ 10, (భద్రాద్రి న్యూస్)**

వైరా నియోజకవర్గ మండల పరిధి గొల్లపూడి గ్రామంలో గురువారం చాకలి ఐలమ్మ 41 వ వర్ధంతి వేడుకలు రజక సంఘం జిల్లా కార్యదర్శి, గ్రామ ఉపసర్పంచి ఏలప్రోలు వెంకటప్పయ్య ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ నివాళి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ మేడూరి రామారావు, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు ఎస్కే సైదా, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి సతీష్ ముఖ్య అతిథులుగా విచ్చేసి చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ రజక సంఘం అధ్యక్షులు తిరుమల దాసు రామకృష్ణ, తిరుమల దాసు శేషయ్య, జీడిమెట్ల పుల్లారావు, ఎస్ కే.సలీం, దాసాంజనేయ స్వామి ఆలయ మాజీ చైర్మన్ కొత్తపల్లి వెంకటేశ్వరరావు, పెండ్యాల కోటేశ్వరరావు, అమర్నేని రాఘవయ్య, తేరాల రాజేష్, గుగ్గిళ్ళ వంశీ, నాయకులు, గ్రామ ప్రముఖులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని తెలంగాణ విముక్తి పోరాట వీరనారి చాకలి ఐలమ్మకు ఘనంగా నివాళులర్పించారు